# సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న గిరిజనులు

బోథ్, జూలై 3 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పరుపులపల్లెలో ఆదివాసీ గిరిజనులు సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పోడు భూములకు పట్టాలతో పాటు రైతు బంధు, రైతు బీమా సౌకర్యం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ (బీ) సర్పంచ్ జుగ్నాక్ మారుతి, గ్రామ పటేల్ రావుడు, జంగు, సుంగు, లక్ష్మణ్, జగదీశ్, ధర్మన్న , తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, జూలై 3 : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజనదర్బార్ నిర్వహించారు. గిరిజనులు వివిధ సమస్యలపై ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఓఎస్డీ శ్రీజ, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి బాలు, ఏవో రాంబాబు, పీహెచ్‌వో సందీప్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కస్తూర్బా విద్యాలయాల్లో కొలువులు

- కాంట్రాక్టు పద్ధతిన భర్తీకి పాఠశాల విద్యాశాఖ నిర్ణయం
- నిర్మల్ జిల్లాలో 60 పోస్టుల భర్తీకి ప్రకటన
- రేపటితో ముగియనున్న దరఖాస్తుల ప్రక్రియ
- మహిళలకు సదావకాశం



జామ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

సారంగాపూర్, జూన్ 3 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ)ల్లో పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీ, నర్సింగ్‌తో కలిపి 58, అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాల (యూఆర్ఎస్)లో ప్రత్యేకాధికారి, సీఆర్టీ రెండు పోస్టుల ఖాళీలను అర్హత కలిగిన మహిళలచే కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ప్రకటన కూడా జారీ చేసింది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 18 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి. వాటిలో కొన్ని చోట్ల ప్రభుత్వం ఇంటర్ విద్యను ప్రవేశపెట్టింది. ఖాళీలను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది.

### రాతపరీక్ష ఆధారంగా నియామకం...

జూన్ 26వ తేదీన ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ జూలై 5వ తేదీన ముగియనుంది. ఆన్‌లైన్ విధానం ద్వారానే పరీక్ష ఉంటుంది. జూలై 24న అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్స్, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు, 25న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, నర్సింగ్ తెలుగు, ఉర్దూ, బాటని, కెమిస్ట్రీ, సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్, ఫిజిక్స్, జువాలజీ పీజీసీఆర్టీలకు, 25న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మ్యాథమెటిక్స్ సీఆర్టీలకు, 26న ఫిజికల్‌సైన్స్, సోషల్‌స్టడీస్, బయోసైన్స్, ఫిజికల్ ఎడ్యూకేషన్ టీచర్లకు, 26న అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌లో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్‌స్టడీస్ సబ్జెక్టులు బోధించేందుకు సీఆర్టీల పోస్టుల వారీగా పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు, పోస్టుల వివరాలు, పరీక్ష నిర్వహణకు సంబంధించిన సమగ్ర సమాచారం https.schooledu. telaNgana. gov.in వైబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

### అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్న పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీ, నర్సింగ్ పోస్టులకు అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. బుధవారం సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి. మెరిట్ ప్రకారం మాత్రమే మహిళా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ పరీక్ష విధానంలో ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేదు. జూలై 24 నుంచి 26వ తేదీ వరకు పరీక్ష ఉంటుంది. ఆగస్టు 5వ తేదీలోపు ప్రక్రియ మొత్తం పూర్తి కానుంది. **-రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్ జిల్లా**

## బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

మామడ,జూలై 3 : నిర్మల్ జిల్లా మామడ మండలం కొరిటికల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ తెలిపారు. సోమవారం విడుదల చేసిన జాబితాలో పాఠశాలకు చెందిన రెడ్డి మల్ల శ్రీహర్షిని, గంగడి అభిజ్ఞారెడ్డి ఎంపికయ్యారు. విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- విద్యార్థులకు షూలు అందజేత



జైనథ్ : విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్, జూలై 3 : ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం జైనథ్ మండలం మాండగడ, పెండల్‌వాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాండగడలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ , పెండల్‌వాడలో పాఠశాలలో కార్తీక్‌రెడ్డి షూస్ అందజేయడం అభినందనీయమన్నారు.

### విద్యార్థులకు సమక్షంలో జన్మదిన వేడుకలు

పెండల్‌వాడ పాఠశాల విద్యార్థుల సమక్షంలో ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, వైస్‌ఎంపీపీ విజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు బాలురి గోవర్ధన్ రెడ్డి, పురుషోత్తంయాదవ్, నాయకులు రమేశ్, చంద్రయ్య, సర్పంచ్‌లు సురేశ్, ఇందు, మహేందర్ పాల్గొన్నారు.



ఎదులాపురం : మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, జూలై 3 : జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందస్తు వేడుకల్లో భాగంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. జోగు రామన్న చిత్రంతో కూడిన మాస్కులను ధరించి చిన్నారులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడం ఆకట్టుకున్నది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన ఎమ్మెల్యే

ఎదులాపురం, జూలై 3 : అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో గౌడగడప హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఈత చెట్లను నాటి నీరు పోశారు. ముందుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, గౌడ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజానంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయి కుమార్, నాయకులు పందిరి భూమన్న, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరంలో పాల్గొనాలి

ఎదులాపురం, జూలై 3: ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న మోగా రక్తదాన శిబిరంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానాలు పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం పట్టణంలోని జనార్దన్ రెడ్డి గార్డెన్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు ఇటీవల బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా నియామకమైన గంగారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

# ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



అర్జీలను స్వీకరిస్తున్న నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్ టౌన్, జూలై 3 : ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 45 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని డబుల్‌బెడ్రూం ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బాధితులు కలెక్టర్‌కు విన్నవించారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని గిరిజనులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సత్వర పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, జూలై 3 : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆయన స్వీకరించారు. భూసంబంధ, పింఛన్, ఉపాధి కల్పన, పౌరసరఫరాలు, విద్య, రెవెన్యూ, డబుల్‌బెడ్రూం ఇళ్లు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, తదితర సమస్యలపై అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని ఆయా శాఖాధికారులకు సూచించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్ నటరాజన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.